క్లుప్తంగా

విద్యార్థులకు డైరీలు పంపిణీ



పంపిణీ చేసిన డైరీలతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

మధిర: మాటూరు ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, షేక్ ఇబ్రహీం, లావుడ్యా రవికుమార్, బానోత్ రాందాస్‌ల సౌజన్యంతో విద్యార్థులకు డైరీలను సమకూర్చారు. ఈ డైరీలను శుక్రవారం ఎంఈఓ వై.ప్రభాకర్ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, ఉపాధ్యాయులు దీవి సాయికృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో వీధి కుక్కల బెడద పరిష్కారం కోసం మున్సిపాలిటీలో ఫిర్యాదుల స్వీకరణ కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. వీధుల్లో కుక్కల బెడద ఉన్నట్‌లైతే కార్యాలయంలోని సెల్ నంబర్ 8185869162 కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఆర్థిక సాయంతో.. పారిశుద్ధ్య పనులు



అంజనాపురంలో చెత్త ఎత్తుతున్న కూలీలు

కొణిజర్ల: మండలంలోని అంజనాపురం గ్రామంలో గత నెల రోజులుగా పారిశుద్ధ్యాన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు వారం రోజులుగా ఎడతెరిపి లేని వానలు కురుస్తుండటంతో చెత్త కుళ్లి దుర్వాసన వస్తుండటంతో గ్రామానికి చెందిన చల్లగుండ్ల రోశయ్య, కుమారుడు రమేష్ సొంత ఖర్చులతో 5గురు మనుషులను పంచాయతీ కార్మికులకు సహాయంగా ఏర్పాటు చేసి ట్రాక్టర్‌లో చెత్త ఎత్తించి బయట పడవేయించాడు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఏన్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములు కోరారు. మండలంలోని రాజలింగాల, ఏన్కూరులో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశీలించారు. జ్వరం సోకిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాజు, హెల్త్ అసిస్టెంట్ బాస్కర్‌రెడ్డి, ఏఎన్‌ఎం అరుణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు పోరాడుదాం

తల్లాడ: విద్యార్థి దశనుంచి 50 సంవత్సరాల పాటు అలుపెరగని పోరాట యోధుడిగా గ్రామ స్థాయి నుంచి కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, తెలంగాణా ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకుడు ఎస్.కె.లాల్‌మియా అన్నారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు పుల్లమ్మ, జానీ, అనసూయ, అచ్చమ్మ పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తిని శుక్రవారం స్నేహితులు పరామర్శించారు. అమెరికాతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన ఆయన మిత్రులు వచ్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ప్రవాస భారతీయులు జగ్గారెడ్డి రమేష్, వెంకటేశ్, సుబ్బారావు, పిచ్చిరెడ్డి, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్‌రావు, కృష్ణారావు, అనుమోలు బద్దిసాగర్ ఉన్నారు.

కనకారావుకు కాంగ్రెస్ నాయకుల నివాళి

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి కనకారావు (60) మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, కాంగ్రెస్ నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, బండెల నాగార్జున్ తదితరులు ఉన్నారు.



బ్యాగులతో పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు

బడి 'బ్యాగు' భారం

- పరిమితికి మించిన బరువు
- శారీరక ఎదుగుదలపై ప్రభావం
- ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ

చదువు బారెడు... పుస్తకాలు బండెడు అనే చందంగా మారింది ప్రైవేట్ పాఠశాలల పరిస్థితి. నర్సరీ, ఎల్‌కేజీ నుంచే బాల్యం బండెడు బరువును మోస్తూ ఆపసోపాలు పడుతోంది. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన చిన్నారులు చదువు పేరుతో పరిమితికి మించి బరువును మోస్తున్నారు. బడి బ్యాగు మోయలేక నీరసించి పోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపుతున్నామని సంబరపడి పోతున్నారే తప్ప వారు మోస్తున్న పుస్తకాల బరువు ఎంత అనేది పట్టించుకోవడం లేదు. ఫలితంగా చిట్టి చేతులు కందిపోతున్నాయి. చిన్ని నడుము వంగిపోతుంది.

వైరా: ప్రతి విద్యార్థి తన బరువులో 8వ వంతు భారమే మోయాలని వైద్యులు సూచిస్తున్నా.. విద్యార్థులు తన బరువు కంటే 15 నుంచి 20 శాతం అధిక బరువును మోస్తున్నారు. ఐదేళ్ల నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు అధిక బరువు మోయరాదన్న ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం శోచనీయం. ఉదయాన్నే బ్యాగు భుజానికి ఎత్తుకొని, లంచ్ బాక్స్ చేత పట్టుకొని పాఠశాలకు హుషారుగా వెళ్లే పిల్లలు సాయంత్రం అదే బ్యాగును ఎత్తుకొని నీరసంగా, ఉసూరు మంటూ తిరిగి వస్తున్నారు. ఇది చూసి జాలి పడాలా లేక చదువుకోసమే కదా అని సర్దుకు పోవాలా.. అన్నది తల్లిదండ్రులకు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలు మారిన పాఠశాల బోధనలో మార్పులు రావడం లేదు.

అమలుకు నోచుకోని నిబంధనలు..

ప్రతి విద్యా సంవత్సరం జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా వార్షిక విద్యా ప్రణాళిక విడుదలవుతోంది. వీటిలో పరీక్షలు, పాఠ్యాంశాల నిర్వహణతో పాటు సాంస్కృతిక ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో పట్టిక రూపొందించాల్సినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. ప్రైవేట్ పాఠశాలల కోసం ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి ఆయా పాఠశాలల్లో రోజు వారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తనిఖీ చేపట్టాల్సి ఉండగా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు స్పందించి పాఠశాలలపై చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనవసరమైన పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్ట్‌లకు ఆరు పాఠ్యపుస్తకాలు, మరో ఆరు నోట్ పుస్తకాలతో కాపీరైట్‌కు సంబంధించి మరో నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలలు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తల్లిదండ్రులపై ఫీజుల బరువు.. విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 8 నోట్ పుస్తకాలు ఉండాలి. కానీ ప్రైవేట్ పాఠశాలల్లో 20 నుంచి 25వ రకు పుస్తకాలు ఉంటున్నాయి. పుస్తకాలను పరిశీలిస్తే ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్ హోం, స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ ఇతర మరో రెండు పస్తకాలను జోడిస్తున్నారు.

సొంత సిలబస్‌తో బండెడు పుస్తకాలు..

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు విద్య బోధన చేయాలి. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్య పుస్తకాలతో పాటు ప్రైవేట్ ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. దీంతో పాటు అదనంగా రాసిన పుస్తకాలను పాఠశాలలోనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ బయట కొనుగోలు చేసినవి పనికిరావని చెప్తూ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటూ.. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

విద్యార్థుల మానసిక స్థితిపై ప్రభావం..



అధిక బరువు మోయటం వల్ల విద్యార్థుల్లో మొదటగా మానసిక స్థితిపై ప్రభావం పడుతుంది. పాఠశాలకు వెళ్లాలంటే ఇంత బరువు మోయాలా అనే భయం కలుగుతుంది. శారీరక పెరుగుదలకు ఇబ్బంది కలుగుతుంది. పిల్లల ఎముకలు, వెన్నెముకపై భారం పడొద్దు. భవిష్యత్‌లో వెన్నుపూసకు సంబంధించి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చిన్న ఒత్తిడికి గురై కిందపడి పోతారు. ఎముకలు విరిగే ప్రమాదం ఉంది.

– ఎస్.సతీష్‌కుమార్, ప్రముఖ వైద్యుడు, వైరా

వైద్య నిపుణులు చెబుతున్న వివరాలిలా..

పిల్లల్లో.. సాధారణంగా 15 ఏళ్లలోపు శరీరంలో వివిధ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ వయస్సులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడం వల్ల పార్శ్వగునిస్కోలియోసిస్ వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. వెన్ను ఒక వైపునకు వంగి పోవడాన్ని స్కోలియోసిస్‌గా పరిగణిస్తారు. ఇటువంటి ఇబ్బందులను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించాలి. అధిక బరువుతో కూడిన పెద్ద సైజు స్పోర్ట్స్ బ్యాగుల్లాంటివి కాకుండా పుస్తకాలకు సరిపడా తేలికైనవి కొనుగోలు చేయాలి. విద్యార్థి బరువులో పుస్తకాల బ్యాగు బరువు 15శాతం మించరాదు. ఉదాహరణ 20కిలోల బరువున్న విద్యార్థి మూడు కిలోలకు మించి మోయరాదు. బ్యాగును రెండు భుజాలపై సమానంగా బరువును పడే రీతిలో తగిలించుకోవాలి. ఒకవైపు తగిలించుకోవడం వల్ల భుజం, మెడ, నొప్పులకు లోనవుతారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చు.

ఆగస్ట్ చివరి నాటికి గోదావరి జలాలు



కొణిజర్ల: కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్


వైరా/కొణిజర్ల: ఆగస్ట్ నెలాఖరు నాటికి సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో నింపుతానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం కొణిజర్ల శ్రీరామ కల్యాణ మండపంలో నిర్వహించిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై 82 మందికి కల్యాణలక్ష్మి, 20 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, ఎంపీపీ మధు, రామారావు, శ్రీనివాసరావు, రవి, రమేష్, ఎంపీడీఓ రోజారాణి, ఏఓ బాలాజీ, ఆర్‌ఐ అశోక్, ఎంపీటీసీ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం..

ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణాలు మాఫీ చేసేందుకు నిధులు విడుదల చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి చిత్ర పటాలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పాలాభిషేకం చేశారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీకి ఘనంగా వీడ్కోలు

మధిర: మధిర కోర్టులో గత తొమ్మిది సంవత్సరాలుగా ఏపీపీగా పనిచేసి బదిలీపై కొత్తగూడెం కోర్టుకు వెళ్తున్న జి.నాగలక్ష్మికి శుక్రవారం బార్ అసోసియేషన్ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధిరకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇంతమంది న్యాయవాదుల మనసులను చురగొనడం విశేషం అన్నారు. సన్మాన గ్రహీత నాగలక్ష్మి మాట్లాడుతూ.. న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకారంతోనే నా బాధ్యత నెరవేర్చానని తెలిపారు. అదే విధంగా మరో ఏపీపీ జన్ను భద్రయ్య మాట్లాడుతూ.. నాగలక్ష్మిని ఆదర్శంగా తీసుకొని బార్ మరియు బెంచ్ సహకారంతో పేద ప్రజలందరికీ న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు, ఏపీపీ భద్రయ్య, సీనియర్ న్యాయవాదులు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, మోహన్దాస్, జనార్దన్‌రావు, గోపాల్, సుబ్రహ్మణ్యం, పూర్ణచంద్రరావు, రమేష్, రామరాజు, కష్టారావు, శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీపీ నాగలక్ష్మిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కొణిజర్ల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ముదిరాజ్‌లు



సత్తుపల్లిరూరల్: తహసీల్‌లో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్/కొణిజర్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతురావు, ఉపాధ్యక్షుడు నార్ల మల్సూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు అన్నారు. గురువారం సత్తుపల్లి మండలంలోని కిష్టారం చేపల సొసైటీ అధ్యక్షుడు సేలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశంలో వారు పాల్గొన్నారు. అదే విధంగా కొణిజర్ల మండలంలో సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లో చేర్చాలన్నారు. ముదిరాజుల జీవనభృతి అయిన చెరువులు, కుంటలపై పూర్తిస్థాయిలో హక్కులు కల్పించే విధంగా చట్టం చేయాలని, మత్స్యకారుల అభివృద్ధికి 75 శాతం సబ్సిడీతో అవసరమైన పరికరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, వేలాద్రి, దుర్గయ్య, రమేష్, శ్రీనివాసరావు, కోటయ్య, శ్రీను, కేశవరం చేపల సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, రవి, చందు, విజయ్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

వైరా మున్సిపాలిటీకి 'అమృత్' యోగం

– రూ.26 కోట్లు మంజూరు



వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా మున్సిపాలిటీకి అమృత్ పథకం ద్వారా రూ.26 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తెలిపారు. శుక్రవారం వైరాలో సాక్షితో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో శివారు గ్రామాల్లో, వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మూడు మంచి నీటి ట్యాంకులతో పాటుగా, 20 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ల నిర్మాణం చేపడతామన్నారు. పల్లిపాడు, వైరా మూడో వార్డు, 5వ వార్డు పరిధిలో.. ఒక్కో ట్యాంక్ 9 లక్షల లీటర్ల కెపాసిటీతో ఎమ్మెల్యే సూచనలతో నిర్మాణ పనులు చేపడతామన్నారు.

వారాహిదేవి అలంకరణలో అమ్మవారు

మధిర: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని వారాహిదేవి రూపంలో అలంకరించారు. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఈ వారం రోజులు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులందరూ అమ్మవారి సేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పూజారి శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరీ ఉత్సవాలు

మధిర: మండలంలోని మాటూరుపేట గ్రామంలోఉన్న అంకమ్మ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ఘనంగా శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించి శాకంబరీ దేవిగా దర్శనం కల్పించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అర్చకుడు శివయ్య శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సెక్రటరీ గడ్డం రమేష్ దంపతులు, మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: తల్లాడ విద్యుత్‌సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏన్కూరు: మండల కేంద్రంలో నేడు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఏఈ ఉమకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమత్తుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



సత్తుపల్లిటౌన్: అయ్యగారిపేటలో నీటమునిగిన పంట పొలాలు

- పొంగుతున్న వాగులు, వంకలు
- మునిగిన పంట పొలాలు
- పరిశీలిస్తున్న అధికారులు



తల్లాడ: బిల్లుపాడు-రామచంద్రాపురం గ్రామాల మధ్య వాగును పరిశీలిస్తున్న ఎస్సై కొండల్‌రావు, సిబ్బంది



తల్లాడలోని కృష్ణ మందిరం రోడ్డులో ఓ ఇంటి ముందు నిలిచిన వరదనీరు



తల్లాడ: కల్లూరు వాగు వద్ద వరద ఉధృతికి కోతకు గురైన ప్రాంతం

సత్తుపల్లిటౌన్: ఎడతెరపి లేకుండా మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని అయ్యగారిపేట తోగువాగు ప్రాంతంలోని పంట పొలాలు నీటమునిగాయి. అయ్యగారిపేట తామరచెరువు నుంచి తోగువాగుకు వరద ప్రవాహం పెరగటంతో అయ్యగారిపేటలో పంట పొలాలు వరద నీటితో మునిగిపోయ్యాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు లింగగూడెం చెరువుతో పాటు పలు గ్రామాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి. కందుకూరు తుంగవారి కాలనీ వద్ద ఉన్న ఉప్పు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కందుకూరు, దుద్దెపూడి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

తల్లాడ: మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మిట్టపల్లి వద్ద ఉన్న గంగదేవిపాడు వాగు, వెంగన్నపేట–నూతనకల్ గ్రామాల మధ్య ఉన్న కల్లూరు వాగు, పినపాక–వెంకటాపురం గ్రామాల మధ్య ఉన్న వాగు, బిల్లుపాడు వాగులకు పై నుంచి వచ్చిన వరద ఉధృతికి ప్రవహిస్తున్నాయి. వెంగన్నపేట–నూతనకల్ మధ్య ఉన్న వాగు వద్ద కోతకు గురై ప్రమాద భరితంగా తయారైంది. వెంగన్నపేట వద్ద కల్లూరు వాగుపై నూతనంగా బ్రిడ్జీ నిర్మిస్తుండగా వాగు ఉధృతి వల్ల పాత బ్రిడ్జీ పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండగా.. తల్లాడ ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆ మార్గంలో డ్రమ్ములు ఏర్పాటు చేసి రాక పోకలను నిలిపివేశారు. తల్లాడ ఎద్దుళ్ల చెరువు, బ్రాహ్మణ పల్లి చెరువులు, మల్లవరం చిన్న మాలకుంట చెరువు, నూతనకల్ నాగుల చెరువులకు వరదనీరు బాగా వచ్చింది. తల్లాడలో పలు రోడ్లు జలమయమయ్యాయి.

కట్లేరుకు చేరుతున్న వరద



ఎర్రుపాలెం: అలుగు పోస్తున్న కట్లేరు

ఎర్రుపాలెం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కట్లేరు ప్రాజెక్ట్‌కు వరద నీరు చేరుతుంది. గంగదేవపాడు వద్ద ప్రాజెక్ట్ వద్ద అలుగు పారుతుంది. పరిసర ప్రాంతాల్లోని వరద నీరు భారీగా చేరుతుండటంతో కట్లేరుకు జలకళ సంతరించుకుంది.

కల్లూరు పెద్ద చెరువు..

కల్లూరు: మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులలో జలకళ సంతరించుకుంది. కల్లూరు పెద్ద చెరువుతో పాటు మండలంలోని 20 చెరువుల వరకు అలుగులు పడ్డాయి. కల్లూరు పెద్ద చెరువును శుక్రవారం తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, జలవనరులశాఖ డీఈ రాజా రత్నకుమార్, ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్, ఈఓ సీహెచ్ కృష్ణారావులు సందర్శించి పరిశీలించారు. చెరువు కట్ట ఎక్కడన్నా బలహీనంగా ఉంటే దానిని పటిష్ట పరచాలని తహసీల్దార్ పులి సాంబశివుడు అధికారులకు సూచించారు.



కల్లూరు: అలుగు పోస్తున్న కల్లూరు పెద్ద చెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉండండి



తుంబూరు-కందుకూరు రహదారి చప్టాపై వరదను పరిశీలిస్తున్న ఏసీపీ రఘు



మధిర: వైరా నదిని పరిశీలిస్తున్న సీఐ మధు, మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా

సత్తుపల్లి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు అన్నారు. సత్తుపల్లి డివిజన్‌లోని చెరువులు, వాగులు, చప్టాలను శుక్రవారం సీఐ టి.కిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న నివాస గృహాలను ఖాళీ చేయాలని, ఇంట్లో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసి విద్యుత్ స్తంభాలను, గోడలను తాకొద్దని, పిడుగులు, గాలిదుమారం వీస్తున్నప్పుడు చెట్ల కింద ఉండవద్దన్నారు. వర్షానికి రోడ్లు దెబ్బతిని గుంతలు పడినందున వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు.

వైరా నదిని పరిశీలిస్తున్న సీఐ, మున్సిపల్ కమిషనర్..

మధిర: మధిర శివాలయం వద్ద పొంగి ప్రవహిస్తున్న వైరా నదిని మధిర పోలీస్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ మధు, మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా వాగులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాని, ప్రజలు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. శిథిలావస్థకు చేరిన గృహాల్లో ప్రజలు ఎవరు ఉండొద్దన్నారు. వర్షాలకు గోడలు నాని కూలే ప్రమాదం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పట్టణంలో 21 గృహాలను కూల్చాలని నోటీసులు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోన ధనికుమార్, కాంగ్రెస్ నాయకులు విజయ్, రమేష్, సందీప్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి..



వైరా ఏసీపీ రహమాన్

వైరా: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో పని చేసి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వైరా ఏసీపీ ఎంఏ రహమాన్ సూచించారు. శుక్రవారం వైరాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైరా డివిజన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, వాగులు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అధిక నీటి ప్రవాహాల వద్దకు ప్రజలెవరూ వెళ్ల వద్దన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తల్లాడ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.సత్యావతి అన్నారు. అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముద్దునూరు సెక్టార్ పరిధిలోని కుర్నవల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యావతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



కుర్నవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు